క్లుప్తంగా

చూసిన కనులదే భాగ్యము



వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం అర్బన్: శ్రీదేవి భూదేవి సమేతుడైన వెంకన్న పెళ్లికొడుకు మోముతో చిరుసిగ్గులొలుకుతూ తాడేపల్లిగూడెం పట్టణ వీధుల్లో ఊరేగారు. భక్తులు వడ్డికాసుల వాడా.. వెంకటరమణ గోవిందా.. గోవిందా అంటూ పారవశ్యం చెందారు. స్థానిక ఎగ్జిబిషన్ గ్రాండ్‌లో కోనేటిరాయుడు కొలువుదీరిన ఏడుకొండల స్వర్గం సెట్టింగ్ సాక్షాత్కరించారు. ధగధగ కాంతులతో మెరిసే కల్యాణ వేదికపై తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన రుత్విక్కుల బ్రహ్మత్వంలో వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య వెంకన్న పెళ్లి కనుల పండువగా సాగింది. కలియుగ దేవుడు, భక్తుల కొంగుబంగారం, కోరిన కోర్కెలు తీర్చే శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం ప్రధానపు గడియ నుంచి ఆద్యంతం సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టింది. సంప్రదాయ మేళతాళాలు, సంస్కృతికి దర్పణంగా అలంకరణలతో వేషాలు, కోలాట భజనలు ఆకట్టుకున్నాయి. విజయవాడ కనకదుర్గ దేవస్థానం సభ్యులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు, వైఎస్సార్‌సీపీ నేత మారం వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ఈ కల్యాణ కదురమణీయంగా నిర్వహించారు. భక్తులు తమ భక్తిప్రపత్తులను చాటుకున్నారు. ప్రసాద వితరణ జరిగింది. మాజీ ఎమ్మెల్యే ఈలి నాని, బీజేపీ నాయకులు ఈతకోట తాతాజీ, ఆర్యవైశ్య సంఘ నాయకులు కోనా శ్రీనివాసు, ఒబిలిశెట్టి నటరాజు, పాలూరి వెంకటేశ్వరరావు, మాకా శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

వంతెన మార్గం ప్రమాదకరం

నరసాపురం: పట్టణంలోని రుస్తుంబాధలో మంగళగుంట పాలేనికి వెళ్లే వంతెన మార్గం ప్రమాదకరంగా ఉంది. దీంతో అటుగా వెళ్లేవారు ఆందోళనకు గురవుతున్నారు. వంతెన ఎక్కే మార్గంలో అటూ, ఇటూ కూడా రాళ్లు పైకి లేచిపోయాయి. రోడ్డు కూడా శిథిలమైంది. దీంతో వాహనదారులు ప్రమాదాలకు లోనవుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన



మంచిలిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ సూర్యనారాయణ

అత్తిలి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న పనులు నిర్దిష్ట కొలతల ప్రకారం, నాణ్యతతో ఉండాలని ఎంపీపీ మక్కా సూర్యనారాయణ కోరారు. అత్తిలి మండలం మంచిలి గ్రామంలో చేపట్టిన ఉపాధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఉపాధి పథకం ద్వారా ప్రజలకు ఉపాధి కల్పించడంతో పాటు, గ్రామంలో నెలకొని ఉన్న సమస్యలు పరిష్కారమవుతున్నాయని చెప్పారు. ఉపాధి కూలీలకు మెడికల్ కిట్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను ఆయన అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీవీఎస్ రామారావు, వైస్ ఎంపీపీ దారం శిరీషా, సర్పంచ్ చింతారామయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని విమర్శించడం పవన్ కల్యాణ్‌కు తగదు

తణుకు టౌన్: వైఎస్సార్‌సీపీని విమర్శించే స్థాయి జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు లేదని తణుకు మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కె.జస్పాల్ అన్నారు. పవన్ కల్యాణ్ రాబోయే ఎన్నికల్లో పోటీ చేసి గెలుస్తామనే విశ్వాసం లేదనే విషయం ఆయన స్పష్టం చేశారని తెలిపారు. తన పార్టీ గెలుపుపై, కార్యకర్తలపై స్పష్టత, నమ్మకం లేని నాయకుడు వైఎస్సార్‌సీపీని విమర్శించే అర్హత లేదని హితవుపలికారు. వైఎస్సార్‌సీపీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిందని, టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాల్లో 10 పథకాలైన చెప్పాలని డిమాండ్ చేశారు. కాపులు వైఎస్సార్‌సీపీని విడాలని కోరుతున్న పవన్ కల్యాణ్ ముద్రగడ పద్మనాభం విషయంలో ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు.

రేపు జాబ్ అవేర్‌నెస్ ప్రోగ్రాం

భీమవరం(ప్రకాశం చౌక్): ఏపీఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ భీమవరం మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం భీమవరం పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్ - విజ్ఞాన సాంస్కృతిక వికాస కేంద్రం లో జాబ్ అవేర్నెస్ సదస్సును నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ ఎ. వీరయ్య, వి సువర్ణ రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశ వ్యాప్తంగా నిరుద్యోగులు ఎక్కువగా ఉన్నారనీ, నిరుద్యోగుల్లో ఎక్కువ శాతం ఉపాధి అవకాశాల పై అవగాహన లేక మంచి ఉద్యోగాలు పొందడం లేదనీ, అటువంటి వారికి అవగాహన కలిగించేందుకు, వివిధ రంగాల్లో అపార అనుభవం ఉన్న నిష్ణాతులతో ఒక అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నిరుద్యోగ యువత భవిష్యత్ ప్రణాళికకు ఈ సదస్సు ఎంతగానో ఉపయోగ పడుతుందని తెలిపారు.

రూ.కోటితో డ్రెయిన్లు, రహదారుల నిర్మాణం



పెనుగొండలో రూ.కోటితో చేపట్టబోయే పనులు పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: పెనుగొండలో రూ. కోటితో రహదారులు, డ్రెయిన్లు పనులు చేపటనున్నట్లు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు తెలిపారు. పెనుగొండలో జీజీపీ నిధులతో చేపట్టబోయే పనులను తూర్పుపాలెంలోని కార్యాలయంలో పరిశీలించారు. ఐదు సచివాలయాల పరిధిలోనూ వీటితో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇప్పటికే పెనుగొండలో కోడి పందేల దిబ్బ, నగరేశ్వర స్వామి కాలనీల్లో రహదారులు, విద్యుత్, త్రాగునీటి సదుపాయాలను కోట్లాది రూపాయల వ్యయంతో పూర్తి చేసినట్లు తెలిపారు. అదే విధంగా నాయీ బ్రాహ్మణ, కార్పెంటర్, ఎలక్ట్రిషియన్స్, ఆర్‌ఎంపీ, కాపు, బీసీ కమ్యూనిటీ భవనాలకు రూ. 2 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. వీటిలో ఇప్పటికే పలు కమ్యూనిటీ భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. నాడు–నేడులో ప్రాథమిక పాఠశాలల అభివృద్ధి పూర్తి చేయగా, రూ.3 కోట్లుతో చెరుకువాడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవన నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు, వీటితో పాటు మండల పరిషత్ నిధులతోనూ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. మరిన్ని నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజులు పాల్గొన్నారు.

వైద్య సేవలు విస్తృత పరచాలి

పెనుగొండ: పేదల వైద్యం వారి ముంగిటకే అందించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కంకణం కట్టుకొన్నారని, దీనికి అనుగుణంగా వైద్య సేవలు మరింత విస్తృత పరచాలని మాజీమంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శుక్రవారం పెనుగొండ సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశంలో తూర్పుపాలెంలో నిర్వహించారు. గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేస్తే సీఎం జగన్ ఆరోగ్యశ్రీలో మరిన్ని జబ్బులను చేర్చి పటిష్టంగా అమలు చేస్తున్నారన్నారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రతీ పేదవాడికి వైద్యం సక్రమంగా అందించాలని కోరారు. సమావేశంలో అభివృద్ధి కమిటీ సభ్యుడు నూలి లక్షణ్ స్వామి, వైద్యాధికారులు డాక్టర్ విజయలక్ష్మీ, డాక్టర్ రాంబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగాపై అవగాహన



పిల్లలకు యోగాలో శిక్షణ ఇస్తున్న దృశ్యం

నరసాపురం: స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ఉత్సాహంగా సాగుతున్నాయి. శుక్రవారం తరగతులకు పెద్దసంఖ్యలో పిల్లలు హాజరయ్యారు. శుక్రవారం ముందుగా పిల్లలకు మహాభారతం, రామాయణం, భాగవతం కావ్యాల్లోని కథలు చెప్పించారు. అనంతరం యోగాపై శిక్షణ, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్ తదితర అంశాలపై తర్ఫీదు ఇచ్చారు. వచ్చే నెల 11 వరకూ జరిగే ఈ శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని, శిక్షణా తరగతులకు తమ పిల్లలను పంపించడానికి తల్లితండ్రులు శ్రద్ధ చూపించాలని లైబ్రేరియన్ కేజేఎల్ఎల్ కుమారి చెప్పారు.

జగనన్న ప్రభుత్వంలోనే రైతులకు పూర్తి భరోసా



పెనుమంట్రలో మాట్లాడుతున్న సలహా మండల అధ్యక్షుడు కొవ్వూరి చిన్నారెడ్డి



మొగల్తూరులో వ్యవసాయ సలహా మండలి సమావేశంలో పాల్గొన్న సభ్యులు

పెనుమంట్ర: రాష్ట్రంలో అన్నివర్గాల రైతులకు పూర్తి భరోసా కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానిదేనని పెనుమంట్ర మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు కొవ్వూరి చిన్నారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. రైతుల పక్షపాతిగా ఉన్న సీఎం జగన్మోహన్‌రెడ్డి పాలనలో నియోజకవర్గ ఎమ్మెల్యేగా రైతుల కష్టసుఖాలు తెలిసిన శ్రీరంగనాథరాజు ఎమ్మెల్యేగా ఉండటం ఈ ప్రాంత రైతుల అదృష్టమన్నారు. పంటకాలంలో రైతులు ఇబ్బందులు పడకుండా రూ. 2 కోట్లు సొంత నిధులు వెచ్చించి రైతులకు ఉచితంగా గోనె సంచులు అందజేయడం అభినందనీయమన్నారు. రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి ప్రభుత్వ ఆదేశాలను సక్రమంగా అమలు చేయాలన్నారు. తహసీల్దార్ డీవీఎస్ అశోక్ వర్మ మాట్లాడుతూ రైతులకు పంపిణీ చేసిన గోనె సంచులు రైతులు సకాలంలో సద్వినియోగం చేసుకునే విధంగా వ్యవసాయశాఖ ఎప్పటికప్పుడు రైతులను పర్యవేక్షిస్తుండాలన్నారు. ఈ సందర్భంగా రైతుల ధాన్యం దూర ప్రాంత రైసుమిల్లులకుకాకుండా స్థానిక రైసుమిల్లులకు రవాణా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు రైతు ప్రతినిధులు సభ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో మార్టేరు ఏడీఏ వి హరి ప్రసాద్, మండల వ్యవసాయశాఖ అధికారిణి ఎ.జ్యోత్స్నల పాల్గొన్నారు.

మినుము, పెసల విత్తనాలు సిద్ధం చేయాలి

మొగల్తూరు: దాళ్వా పనులు పూర్తికావడంతో రైతులకు అందుబాటులో మినుము, పెసలు విత్తనాలు సిద్ధం చేయాలని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కాండ్రేగుల నరసింహారావు సూచించారు. శుక్రవారం నరసాపురం ఏడీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పశువుల దాణా కూడా సిద్ధం చేయాలని, రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించేందుకు ఆర్‌బీకేలు సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఆత్మ చైర్మన్ కడలి రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ, ఏడీఏ అనిల కుమారి పాల్గొన్నారు.

మండల పరిషత్ నిధులతో కాలువ రేవుల నిర్మాణం



పెనుగొండ శాంతి నగర్‌లో కాలువ రేవుల నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ పూతినీడి

పెనుగొండ: మండల పరిషత్ నిధులతో పెనుగొండలో పలు కాలువ రేవుల మరమ్మతులు, నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు పెనుగొండ ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద) తెలిపారు. పెనుగొండ శాంతి నగర్‌లోని శిథిలావస్థకు చేరిన దూళ్లరేవును తొలగించి వాటి స్థానంలో స్నానాల రేవు, దూళ్ల రేవుల నిర్మాణాలకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. కాలువలకు నీరు వచ్చేలోపు నిర్మాణాలు పూర్తి చేస్తామని తెలిపారు. వీటితో పాటు కళాశాల కూడలి వద్ద విద్యార్థులు, వాసవీ శాంతిథాం, వాసవీ మూలవిరాట్ ఆలయానికి వచ్చే భక్తుల ఇబ్బందులు తొలగించడానికి సీఎస్ఎల్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. మండలంలో రూ.1.73 కోట్లుతో పనులకు ఆమోదం తెలిపామని, వీటితో అభివృద్ధి పనులు చేపడతామని వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ సభ్యులు పూతినీడి శ్రీను, పిల్లి చాముండేశ్వరావు, సచివాలయ గృహ సారథి దొరారెడ్డి, తమనంపూడి శ్రీను, తమనంపూడి రామిరెడ్డి, తిక్కిరెడ్డి పవన్, కుడిపూడి సుబ్రహ్మణ్యం, దొంగ ప్రసాద్, దొమ్మేటి రాజేష్, పీఆర్ ఏఈ ఎన్ ఏడుకొండలు. గ్రామ కార్యదర్శి ఎన్‌వీవీ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన ధాన్యం సేకరణ



రామన్నపాలెం సచివాలయంలో ధాన్యం రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ సూర్యతేజ

మొగల్తూరు: ధాన్యం సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని సబ్ కలెక్టర్ ఎం సూర్యతేజ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రామన్నపాలెం 2 సచివాలయాన్ని సందర్శించి ధాన్యం రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ అనిల్ కుమారి మాట్లాడుతూ రామన్నపాలెం 1, 2 సచివాలయ పరిధలో సుమారు 200 ఎకరాలు కోతలకు రావాల్సి ఉందని, 1121 రకం విత్తనాలు వినియోగించడం వల్ల ధాన్యం దిగుబడి ఆలస్యమైందని వివరించారు. దీనిపై స్పందించిన ఆయన ఈ నెలాఖరుకు పూర్తి స్థాయిలో ధాన్యం సేకరణ పూర్తి చేయాలని, రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించేందుకు వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ధాన్యం డబ్బులు కూడా ఎప్పటికప్పుడు రైతుల ఖాతాలో జమ అయ్యేలా చూడాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ జి.అనిత కుమారి, వీహెచ్ఏ రాజగోపాల్ తదితరులున్నారు.

ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం



లంకలకోడేరు పీహెచ్‌సీలో ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైద్య సిబ్బంది

నరసాపురం రూరల్: నర్సులను సిస్టర్ అని పిలుస్తామని అయితే వారిని మదర్ అని పిలిచినా వారు అందించే సేవకు తక్కువేనని వైఎస్‌పాలెం గ్రామ సర్పంచ్ యర్రంశెట్టి నాగముత్యమాంబ అన్నారు. శుక్రవారం నరసాపురం మండలంలోని వైఎస్ పాలెం గ్రామంలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎల్బీచర్ల ప్రా మిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే నర్సులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అనారోగ్యం బారిన పడిన సమయంలో రోగులకు నర్సులు చేసే సేవలను గురించి సర్పంచ్ ముత్యమాంబ, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు బాబు మాట్లాడుతూ ప్రభుత్వం వైద్యం పరంగా చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. తొలుత వైద్య సిబ్బంది, నర్సులను ఘనంగా సన్మానించి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తెలగంశెట్టి శ్రీదేవి, కార్యదర్శి రఘురామ్, తెలగంశెట్టి వాసు తదితరులు పాల్గొన్నారు.

నర్సుల సేవలు అభినందనీయం

పాలకొల్లు అర్బన్: ప్రజలకు నర్సులు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం లంకలకోడేరు పీహెచ్‌సీలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం పురస్కరించుకుని ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో వైద్యులు, ముఖ్యంగా నర్సులు చేసిన సేవలు అభినందనీయమన్నారు. నర్సులు తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి రోగుల ప్రాణాలను కాపాడారన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు డా.నవ్యజీవన్, డా.భవానీ ప్రసాద్, ఆరోగ్య విస్తరణాధికారులు గుడాల హరిబాబు, కె ప్రభాకర్, పీహెచ్ఎన్ పి ఎలిజబెత్, ఫార్మాసిస్ట్ పీవీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

హైవే అథారిటీ అధికారులకు వినతి



మచిలీపట్నంలోని నేషనల్ హైవే అథారిటీ అధికారికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: మండలంలోని సీతారామపురం వద్ద నిర్మించిన టోల్‌గేట్ పేరుమార్పు, స్ట్రీట్‌లైట్ల ఏర్పాటు, పైపులైన్ల పునరుద్ధరణ, అప్రోచ్ రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని కోరుతూ నేషనల్ హైవేస్ అథారిటీస్ వారి కార్యాలయంలో వినతి పత్రం అందించారు. శుక్రవారం సీతారామపురం గ్రామానికి చెందిన సొసైటీ అధ్యక్షుడు పులపర్తి ప్రతాప్, పలువురు గ్రామస్తులతో కలిసి మచిలీపట్నంలోని హైవే అథారిటీ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందించి అందులో పేర్కొన్న సమస్యలను వారికి వివరించారు. సీతారామపురం గ్రామంలో ఏర్పాటు చేసిన టోల్ ప్లాజా కు మొగల్తూరు అని బోర్డు పెట్టారని అయితే ఈ విషయాన్ని తెలియజేసినప్పటికీ తాత్కాలికంగా సీతారామపురం అని స్టిక్కర్‌ను అతికించారన్నారు. దాని స్థానంలో శాశ్వత బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. అలాగే జాతీయ రహదారి నిర్మాణ సమయంలో సుమారు కిలోమీటరు మేర పాడైన గ్రామానికి తాగునీటిని అందించే పైపులైన్ నిర్మాణాన్ని పూర్తిచేయాలని, అలాగే స్ట్రీట్ లైటింగ్ ఏర్పాటు చేయడం, జాతీయ రహదారిని ఆనుకుని మూడు చోట్ల అప్రోచ్ రోడ్లు నిర్మించాల్సి ఉందని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఆయా సమస్యలను పరిష్కరించి గ్రామ పంచాయతీకి న్యాయం చేయాలని సంబంధిత అధికారికి వివరించినట్లు ప్రతాప్ తెలిపారు.

మట్టపర్రులో చర్చి ప్రారంభం



చర్చి ప్రారంభోత్సవంలో పాల్గొన్న కవురు శ్రీనివాస్

పోడూరు: పోడూరు మండలం మట్టపర్రు గ్రామం ఏఏ పేటలో నూతనంగా నిర్మించిన సెయింట్ జాన్ లూథరన్ చర్చి ప్రారంభోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఏఈఎల్‌సీ మోడరేట్ బిషప్ మోస్ట్ రెవరెండ్ డాక్టర్ కె.పరదేశి బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన చర్చి ప్రారంభోత్సవ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్, పాలకొల్లు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ పాల్గొని స్థానిక సంఘస్థులకు అభినందనలు తెలిపారు . ప్రారంభోత్సవం సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు చెల్లెం ఆనంద ప్రకాష్, జెడ్పీ ఫ్లోర్ లీడర్ గుంటూరి పెద్దిరాజు మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, వైఎస్సార్ సీపీ సీపీ నేత గుణ్ణం నాగబాబు, ప్యారిస్ పాస్టర్ రెవరెండ్ డి. విల్సన్ బాబు, వైస్ ఎంపీపీ గుబ్బల సత్యనారాయణ, గ్రామ కమిటీ అధ్యక్షులు కొల్లబత్తుల రవి, అంతర్జాతీయ క్రైస్తవ ప్రసంగికురాలు డాక్టర్ సీహెచ్ భాగ్యలత జోసెఫ్, జిల్లాసెనాడు బిషప్ రెవరెండ్ డాక్టర్ బి.ఆనంద కుమార్ తదితరులు పాల్గొన్నారు.



జెడ్పీచైర్మన్ కవురు శ్రీనివాస్‌ని అభినందిస్తున్న శిరంశెట్టి పూర్ణచంద్రరావు

జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్‌కి అభినందనలు

పాలకొల్లు అర్బన్: ప్రజల దీవెనలతో ఎంపీపీ నుంచి శాసన మండలి సభ్యుడుగా ఎన్నికయ్యానని, ప్రజా సేవ చేసి వారి రుణం తీర్చుకుంటానని జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ హామీ ఇచ్చారు. శాసన మండలి సభ్యుడుగా ఎన్నికై ఈ నెల 15వ తేదీ సోమవారం ప్రమాణస్వీకారం చేయనున్న కవురు శ్రీనివాస్‌ను శుక్రవారం విజయవాడ 55వ డివిజన్ కార్పొరేటర్ శిరంశెట్టి పూర్ణచంద్రరావు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఆయనతో పాటు రెల్లికుల సంఘ పెద్దలు ధనాల శ్రీనివాస్, ఆకుల అప్పారావు, ధనాల ఏడుకొండలు, అల్లం సాయిబాబా, మాడుగుల శ్రీనివాసరావు, నీలాపు శ్రీను తదితరులు ఉన్నారు.

నేడు పాలకొల్లులో గడప గడపకు మన ప్రభుత్వం

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని 22వ వార్డులో శనివారం ఉదయం 8 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, జిల్లా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో పట్టణ వార్డు ఇన్‌చార్జ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి

నరసాపురం: నరసాపురం కోర్టులో శనివారం జరగనున్న జాతీయలోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని నరసాపురం 10వ అదనపు జిల్లాజడ్జి పి.విజయదుర్గ సూచించారు. లోక్ అదాలత్ నిర్వహణపై ఆమె మరోసారి అధికారులు, న్యాయవాదులకు సూచనలు చేశారు. రాజీ చేసుకోదగిన కేసులు పరిష్కరించుకునే విధంగా కక్షిదారులతో మాట్లాడి అవగాహన కల్పించాలని చెప్పారు. లోక్ అదాలత్‌లో వీలైనన్న ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని కోరారు.

ఘనంగా మేడపాడు వెంకమ్మ జాతర



గ్రామదేవత వెంకమ్మ

యలమంచిలి: మేడపాడు గ్రామ దేవతలు వెంకమ్మ, కనకదుర్గమ్మ, జువ్వాలమ్మ అమ్మవార్ల జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు, జాతర నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 7, 8 తేదీలలో జాతర నిర్వహించారు. 9వ తేదీన రాత్రి బలిహరణ, ఊయల ఉత్సవం నిర్వహించి అమ్మవార్లను ఆలయ ప్రవేశం చేశారు. బుధవారం నుంచి ఐదు రోజుల పాటు తీర్థ ఉత్సవాలు జరుగుతున్నాయి. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి అమ్మవార్లను దర్శించుకుని చలవిడి, పానకాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్నారు. ఈ నెల 17న మాంసాహారంతో అన్నసమారాధన నిర్వహించడంతో జాతర ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు, జాతర ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవార్ల ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

సీఎం జగన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు

కాళ్ల: 'తమ కుటుంబంపై ఆధార అభిమానాలు చూపిస్తు మా వెన్నంటే ఉంటు దివంగత నేత పాతపాటి సర్రాజు చేపట్టిన క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఆయన కుమారుడుడైన నాకు క్షత్రియ కార్పొరేషన్ పదవి ఇచ్చి సీఎం జగన్‌మోహన్ రెడ్డి మా కుటుంబానికి గుర్తింపుని ఇచ్చారు' అని పాతపాటి శ్రీనివాసరాజు సీఎం జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన గృహం వద్ద శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాం నుంచి తన తండ్రి పాతపాటి సర్రాజు కుటుంబంపై ఆధారాభిమానులు చూపించే వారిని గుర్తు చేసుకున్నారు. రాజశేఖరరెడ్డి మరణానంతరం కూడా ఆయన తనయులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా కుటుంబం వెన్నంటే ఉన్నారని స్పష్టం చేశారు. జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన అనంతరం తన తండ్రి సర్రాజు ను గుర్తించి రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ గా పదవిని అప్పగించి రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న క్షత్రియులందరికీ సేవ చేసే భాగ్యాన్ని కల్పించాలని తెలిపారు. అయితే ఆయన మరణానంతరం ఆ పదవిని ఆ కుటుంబానికే ఇవ్వాలనే ఆలోచనతో ఆయన కుమారుడైన నాకు మళ్లీ క్షత్రియులందరికీ సేవ చేసే అవకాశం కల్పించారని కృతజ్ఞతలు తెలిపారు. దీనిలో భాగంగా ఈ నెల 14న విజయవాడలో క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ గా ప్రమాణస్వీకారం చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. విజయవాడలో వెంకటేశ్వరరావు రెసిడెన్సీ ,ఆర్టీసీ కాలనీ , సాయిబాబా టెంపుల్ రోడ్డులో బెంజ్ సర్కిల్ వద్ద కార్యక్రమం జరుగుతుందన్నారు.

రేపటి నుంచి తీర్థ మహోత్సవాలు



పెనుమంట్రలో శ్రీదాసాంజనేయ, శ్రీపుంతలో ముసలమ్మ అమ్మవార్ల ఆలయం

పెనుమంట్ర: స్థానిక పంచాయితీ చెరువుగట్టున ఉన్న శ్రీదాసాంజనేయ స్వామి వారు జయంతి, శ్రీపుంతలో ములసమ్మ అమ్మవారి 14వ వార్షిక తీర్థ మహోత్సవాలు ఈ నెల 14 నుంచి 18 వరకూ జరుగుతాయని పల్లపు వీధి యూత్‌లైన్స్ ఉత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం విలేకరులకు తెలిపారు. 14న శ్రీదాసాంజనేయస్వామికి హనుమాద్ జయంతిని పురస్కరించుకుని భక్తులచే పంచామృత అభిషేకాలు, లక్ష నాగవల్లి పత్రపూజలు నిర్వహిస్తారని, అనంతరం పుంతలో ముసలమ్మ అమ్మవారికి సామూహిక లక్ష కుంకుమార్చనలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. 15న మధ్యాహ్నం 3 గంటలకు రామాయణం, అంతర్గత అంశాలపై 15 సంవత్సరాలలోపు బాలబాలికలకు తల్లిదండ్రుల సమక్షంలో క్విజ్ పోటీలు నిర్వహిస్తామని ఈ పోటీలలో ప్రధాన విజేతకు హనుమాన్ బంగారు ప్రతిమను, 10 మందికి కన్సోలేషన్ బహుమతులు అందజేస్తామన్నారు. 16న సాయంత్రం 4 గంటలకు శ్రీదాసాంజనేయస్వామి వారికి గ్రామంలోని పంచరామాలయాల్లో శ్రీసీతారామలక్ష్మణ దర్శింపచేసి, కోలాట భజనలు, వేదమంత్రాలు, రామనామ భజనలతో శక్తివేషాలతో శోభాయాత్రగా రథోత్సవం నిర్వహిస్తారు. 17న కోలాట నృత్య ప్రదర్శనలు, 18వ సాయంత్రం ఆలయ ఆవరణలో అఖండ అన్నసమారాధన నిర్వహిస్తారు.